క్లుప్తంగా

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు


పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్న సిబ్బంది

మందస: జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం భాగంగా కొంకడపుట్టి పంచాయతీ పరిధి సంధిగాం గ్రామంలో మందస పశువైద్యాధికారి డి.శ్రీకాంత్ ఆధ్వర్యంలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు పశులకు బుధవారం వేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ.. పశు వ్యాధులపై పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అక్టోబర్ 15వ తేదీ వరకు ప్రభుత్వం ఉచితంగా పశువులకు టీకాలు వేస్తోందని.. రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ముగిసిన అథ్లెటిక్ పోటీలు


హైజంప్ చేస్తున్న బాలిక

పలాస: డివిజన్ స్థాయి క్రీడా ఎంపిక పోటీల్లో భాగంగా కాశీబుగ్గ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అథ్లెటిక్ పోటీలు, పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో యోగా పోటీలు బుధవారం ముగిశాయి. క్రీడాకారులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొని ప్రతిభను చాటుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, ఏపీ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, ప్రధానోపాధ్యాయులు చిన్నంనాయుడు, వ్యాయామ ఉపాధ్యాయులు కె.హరిబాబు, పి.తవిటయ్య, కె.పి రెడ్డి, సి.హెచ్.పద్మలోచన్, జె.నారాయణ పాల్గొన్నారు.

కబ్జాలను అడ్డుకోవాలి


మాట్లాడుతున్న సుందర్‌లాల్

కవిటి: గొర్లపాడు పంచాయతీలో చెరువులు, భూములు సుమారు 15 ఎకరాలు కబ్జాకు గురైన నేపథ్యంలో వాటిని రక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని సీపీఐ సీనియర్ నాయకులు చాపర సుందర్‌లాల్ అన్నారు. ఈ మేరకు కాజూరులో గ్రామస్తులతో బుధవారం సమావేశం నిర్వహించారు. భూములను కబ్జా చేసిన భూస్వాములకు వ్యతిరేకంగా భూ పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కబ్జా చేసిన భూములను రక్షించేంత వరకు పోరాడతామన్నారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సాలిన నారాయణస్వామి, జిల్లా కార్యవర్గ సభ్యులు పుక్కల్ల అరేలమ్మ, అయినింటి లోకనాథం, కె.వల్లభరావు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలి

ఇచ్ఛాపురం: దేశవ్యాప్తంగా ఉన్న నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించవలసిన బాధ్యత ప్రధానమంత్రి నరేంద్రమోదీపై ఉందని జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు డాక్టర్ పూడి కిరణ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని బస్టాండ్ కూడలిలో ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద జాతీయ నిరుద్యోగ దినోత్సవాన్ని యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. మోదీ పుట్టినరోజును జాతీయ నిరుద్యోగ దినోత్సవంగా పాటించాలన్నారు. కార్యక్రమంలో పలువురు యువజన కాంగ్రెస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎంపీడీవోగా ప్రభాకర్

ఇచ్ఛాపురం రూరల్: ఇచ్ఛాపురం ఎంపీడీవోగా ఎ.ప్రభాకర్‌రావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సారవకోటలో డిప్యూటీ ఎంపీడీవోగా పనిచేస్తూ పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి అభినందించారు.

నేడు మెగా వైద్యశిబిరం

ఇచ్ఛాపురం: వైద్య ఆరోగ్యశాఖ అధికారుల ఆదేశాల మేరకు స్థానిక ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి ఆవరణలో మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్టు వైద్యాధికారి డాక్టర్ పి.దేవేంద్ర రెడ్డి బుధవారం తెలిపారు. చిన్నపిల్లలు, చెవి, ముక్కు, గొంతు, కంటి, మానసిక వైద్యులు హాజరవుతారన్నారు. స్థానికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అప్రమత్తత అవసరం..



పాడి పరిశ్రమపై రైతులు అప్రమత్తంగా ఉండాలి. ఎటువంటి అజాగ్రత్త వహించరాదు. వర్షాకాలంలో ఇబ్బందులు అధికంగా ఉంటాయి. పశువులకు ఎటువంటి ఇబ్బందులు వచ్చినా వెంటనే మా సిబ్బందిని సంప్రదించాలి.

– డాక్టర్ టి. శిరీష, పశువైద్యాధికారిణి, కంచిలి

వర్షాకాలం.. పశువులు జరభద్రం!



- జాగ్రత్తలు తీసుకుంటే జీవాలకు మేలు
- పరిశుభ్రతే ప్రధానం


మేతకు వెళుతున్న ఆవుల మంద

కంచిలి: వర్షాకాలంలో పశువ్యాధులు అధికంగా ప్రబలుతాయి. పశుసంరక్షణలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోకుంటే భారీనష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. ఈ కాలంలో పాడి పశువులు అనేక రోగాలబారిన పడుతుంటాయి. ఎక్కువ సమయం తేమలో గడపాల్సి రావడంతో బాక్టీరియా బారినపడే ప్రమాదం ఉంటుంది. తగిన జాగ్రత్తలు తీసుకుంటే ఈ ప్రమాదం నుంచి బయటపడే అవకాశం ఉందని పశువైద్యాధికారులు పేర్కొంటున్నారు.

షెడ్డుల నిర్వహణ..

పశువుల నీడ కోసం నిర్మించిన షెడ్డులో లీకులు లేకుండా చూసుకోవాలి. కాలిగిట్టలకు ఎక్కువ సేపు తేమ తగలకుండా జాగ్రత్తలు పాటించాలి. లేకుంటే కాలిగిట్టలు పగిలి గాయాలు ఏర్పడి నడవలేని, నిలబడలేని పరిస్థితి ఏర్పడుతుంది. షెడ్డులు పరిశుభ్రంగా ఉంచుతూ, గాలి, వెలుతురూ సక్రమంగా వచ్చేలా చర్యలు తీసుకోవాలి. ఇచ్ఛాపురం నియోజకవర్గంలో 30 వేలకు పైగా పాడి పశువులు ఉండగా, పాడి రైతులు 20 వేల మంది వరకు ఉంటారు. 50 శాతం వరకు మాత్రమే పాడి ఆవులకు షెడ్డులు ఉన్నాయి. మిగిలిన వాటిని చెట్ల కింద, పాడుబడిన ఇళ్ల కింద కడుతున్నారు. ఇటువంటి చోట పాడిపశువులకు ప్రమాదం పొంచి ఉంటుంది.

డీవార్మింగ్ మందులు తప్పనిసరి..

తేమ వాతావరణంలో వ్యాధికి కారణమయ్యే బ్యాక్టీరియాలు ఎక్కువగా వృద్ధి చెందుతాయి. వాటిలో చెప్పుకోదగినవి నులిపురుగులు. పాడిపశువుల్లో అంతర్గత పరాన్న జీవులైన నులిపురుగుల నివారణకు డీవార్మింగ్ మందులను తాగించాలి.

దాణాపై జాగ్రత్తలు..

వర్షాకాలంలో పాడిపశువులకు పచ్చగడ్డి విస్తారంగా లభిస్తుంది. ఇది మంచి ఆహారం. పచ్చగడ్డిని ఎంచుకొని పెద్ద పరిమాణంలో తింటుంటాయి. గడ్డిలో చాలా వరకు నీరు, తక్కువ ఫైబర్ పోషక పదార్థాలు ఉంటాయి. దీని వలన అతిగా పచ్చగడ్డి తిన్నా పశువులకు ఇబ్బందే. ఈ విషయాన్ని రైతు గమనించాలి. పచ్చగడ్డిని ఎండబెట్టిన తర్వాత పశువులకు వేయడం ద్వారా ఫైబర్ చక్కగా అందుతుంది.

డీ టిక్కింగ్ చేయాలి..

తేమ సీజన్లలో పాడి పశువులను పేలు, ఈగలు ఎక్కువగా ఇబ్బందులకు గురిచేస్తాయి. కొన్నిసార్లు పశువుల మరణాలకు కూడా కారణమవుతాయి. పశువుల చుట్టూ తిరుగుతూ ఇబ్బందిపెట్టడమే కాకుండా అనేక రకాల రోగాలకు వాహకాలుగా పనిచేస్తాయి. వీటిని నివారించేందుకు పశువులకు డీ టిక్కింగ్ చేయించాలి. పాడిపశులకు ఎక్కువగా పెరిగిన జుట్టును కత్తిరించాలి.

పొదుగువాపు వ్యాధి..

ఈ వర్షాకాలంలో పాడిపశువులకు ఎక్కువగా పీడించే సమస్యల్లో పొదుగువాపు వ్యాధి ఒకటి. ఈ వ్యాధి సోకిన పశువుకు పొదుగు ఉబ్బి పాల ఉత్పత్తి తగ్గిపోతుంది. సాధారణ యాంటీ బయోటిక్స్ ఉపయోగించి చికిత్స చేయవచ్చు. రోజూ పాడిరైతులు తమ పశువుల పొదుగులను నిశితంగా పరిశీలించాలి. ఏ మాత్రం తేడా వచ్చినా పశువైద్య సిబ్బందికి చూపించి చికిత్స చేయించాలి.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి


జేసీబీతో పిచ్చిమొక్కలను తొలగిస్తున్న దృశ్యం

పలాస: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతిఒక్కరి బాధ్యతని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పలాస-కాశీబుగ్గ పట్టణ కమిటీ అధ్యక్షుడు శిష్టు గోపి, 19వ వార్డు కౌన్సిలరు బృందావతి అన్నారు. పరిశుభ్రతకు సహకరించాలని కోరారు. వార్డు పరిధిలోని సూదికొండ కాలనీలో రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలతో నిండిపోయి చెత్త చెదారం కుళ్లి కంపుకొడుతోంది. దీనిపై పలుమార్లు మున్సిపాలిటీ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ స్పందించలేదు. దీంతో గ్రీవెన్స్‌లో,ఆన్‌లైన్ పోర్టల్‌లో కూడా ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు స్పందించారు. బుధవారం జేసీబీని, పారిశుద్ధ్య కార్మికులను ఆ వార్డుకు పంపించారు. కౌన్సిలర్‌తో పాటు శిష్టు గోపి దగ్గరుండి పారిశుద్ధ్య పనులు చేయించారు. రోడ్డుకు ఇరువైపుల ఉన్న పిచ్చిమొక్కలను తొలగించారు.

ఉత్సాహంగా పీఎం మోదీ జన్మదిన వేడుకలు


మందసలో మోదీ జన్మదిన వేడుకల్లో బీజేపీ నాయకులు

కంచిలి/మందస/ఇచ్ఛాపురం: దేశ ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదిన వేడుకలను బీజేపీ నాయకులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మోదీ చిత్రపటాలకు పాలాభిషేకాలు చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కంచిలి మండలం బూరగాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో హిందీ వికాస వేదిక ఆధ్వర్యంలో, మందసలో బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. ఇచ్ఛాపురంలో గ్రామదేవత స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలో బీజేపీ శ్రేణులు మోదీ పేరిట పూజలు చేశారు.

రోగులకు మెరుగైన సేవలందించాలి


మాట్లాడుతున్న వైద్యురాలు కళ్యాణి

ఇచ్ఛాపురం రూరల్: రోగులకు మెరుగైన సేవలు అందించాలని ఎంపీపీ బోర పుష్ప అన్నారు. కొళిగాం పీహెచ్‌సీలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆస్పత్రిలో అన్ని రోగాలకు మందులు ఉంచాలని సూచించారు. ఆస్పత్రి వైద్యురాలు వై.కళ్యాణి మాట్లాడుతూ.. తొమ్మిది మంది ఏఎన్ఎంలు పీహెచ్‌సీలో ఉండాల్సి ఉండగా.. బదిలీల్లో భాగంగా ఏడుగురు వెళ్లిపోవడంతో కేవలం ఇద్దరు మాత్రమే సేవలందిస్తున్నారన్నారు. దీంతో వైద్యసేవలు అందించడంలో కష్టతరంగా మారిందని అన్నారు. సమావేశంలో సర్పంచ్ సంతోష్‌మండలో, మాజీ ఎంపీపీ కారింగి మోహన్‌రావు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

పెట్రోల్ కల్తీపై తహసీల్దార్‌కు ఫిర్యాదు

సంతబొమ్మాళి: బోరుభద్ర బంక్‌లో పెట్రోల్‌లో నీరు కల్తీ అయిందంటూ గొదలాం గ్రామానికి చెందిన పాలిన శ్రీనివాసరావు ఆరోపించారు. పెట్రోల్ బంకు యజమాని దృష్టికి విషయాన్ని తీసుకెళ్లినప్పటికీ పట్టించుకోకపోవడంతో తహసీల్దార్ హేమ సుందర్‌రావుకు ఫిర్యాదు చేశారు.

19న దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాల పంపిణీ

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుంచి ఇంటర్మీడియెట్ వరకు చదువుతున్న దివ్యాంగ విద్యార్థులకు అవసరమైన ఉపకరణాలను ఈ నెల 19వ తేదీన స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పంపిణీ చేస్తామని ఎస్ఎస్ఏ సహిత విద్య కో–ఆర్డినేటర్ బి.గోవిందరావు శుక్రవారం తెలిపారు.

నేటినుంచి సిద్ధికాళికా సంబర మహోత్సవాలు

కవిటి: బొరివంకలో వెలసిన సిద్ధికాళికాదేవి సంబర మహోత్సవాలు గురువారం నుంచి ప్రారంభమవుతున్నాయి. ఈ నెల 22వ తేదీ వరకు జరగనున్న ఉత్సవాల కోసం కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

టెక్కలి రూరల్: కోటబొమ్మాళి విద్యుత్ సబ్ స్టేషన్‌లో శుక్రవారం మరమ్మతులు చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరాను నిలిపివేస్తామని విద్యుత్ శాఖ ఈఈ నరసింహకుమార్ బుధవారం తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ప్రజావ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలి

పలాస: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను సిక్కోలు పోరాట యోధురాలు పైలా చంద్రమ్మ పోరాట స్ఫూర్తితో ప్రతిఘటించాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్, సహాయక కార్యదర్శి వంకల మాధవరావు పిలుపునిచ్చారు. బొడ్డపాడు అమరవీరుల స్మారక మందిరం వద్ద బుధవారం చంద్రమ్మ 5వ వర్ధంతి కార్యక్రమం వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రకాష్ మాట్లాడుతూ.. కాశీబుగ్గ టి.కె.ఆర్ కళ్యాణ మండపంలో ఈ నెల 25న ఉదయం పది గంటలకు జరగనున్న చంద్రమ్మ స్మారక సభను విజయవంతం చేయాలని కోరారు.

రసాయన ఎరువులు అందజేయాలి

సోంపేట: రసాయన ఎరువులు అందజేయాలని వ్యవసాయాధికారులను రైతులు కోరారు. తాళభద్ర, మామిడిపల్లి గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. వ్యవసాయసహాయ సంచాలకులు భవానీశంకరరావు, వ్యవసాయాధికారి బి.నర్సింహమూర్తి పాల్గొన్నారు.

అవగాహనతోనే సంపూర్ణ ఆరోగ్యం

వజ్రపుకొత్తూరు రూరల్: ప్రజలకు సంక్రమించే వ్యాధులు, తీసుకోవాల్సిన ఆహారం నియమాల పట్ల అవగాహన ఉంటే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని వజ్రపుకొత్తూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రీచార్డ్ బూన్, ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ ఫణీమాధవి అన్నారు. డోకులపాడులో బుధవారం 'స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్'కార్యక్రమాన్ని నిర్వహించారు. సీహెచ్‌వో జి.ఈశ్వరమ్మ, హెల్త్ సూపర్‌వైజర్ ఎస్.చక్రధర్, వైద్య ఆరోగ్య సిబ్బంది టి.లక్ష్మీదేవి, జ్యోతి,సంధ్య, అరుణ ఉన్నారు.

పీఎం సూర్యఘర్‌తో విద్యుత్ సదుపాయం


బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న కమిషనర్ రామారావు, సిబ్బంది

పలాస: ప్రభుత్వం పేదలకు నిర్మిస్తున్న ఇళ్లకు ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం ద్వారా విద్యుత్ సదుపాయాలు కల్పిస్తామని పలాస–కాశీబుగ్గ మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు చెప్పారు. మున్సిపల్ కార్యాలయంలో బుధవారం పీఎంఏవై (యూ) అంగీకార బ్రోచర్లను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణ ప్రాంతాల్లో ఇళ్లు లేని పేదవారికి సొంత ఇల్లు కోసం పీఎంఏవై పథకం కింద రెండు సెంట్లు స్థలం కేటాయిస్తారన్నారు. గతంలో వివిధ దశల్లో ఆగిన ఇళ్లకు బిల్లులు చెల్లిస్తామని చెప్పారు. నిలిచిపోయిన ఇళ్లను పూర్తి చేసి గృహప్రవేశం చేయాలన్నారు. సమావేశంలో టిడ్కో, మెప్మా, హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి


మందస జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులతో సభ్యత్వ నమోదు చేయిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

మందస: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యచూపాలని ఏపీటీఎఫ్ నాయకులు బుధవారం కోరారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు గడిచిన ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఎటువంటి చొరవ చూపకపోగా అసంబద్ధమైన యాప్‌లతో బోధనకు దూరం చేసే ప్రక్రియ కొనసాగించడం చాలా బాధాకరమన్నారు. ఉపాధ్యాయులను కేవలం బోధనకు మాత్రమే పరిమితం చేయాలని కోరారు. ఏపీటీఎఫ్ చేపడుతున్న నిరసన వారం కార్యక్రమంలో భాగంగా పట్టులోగాం, బుడోంబ, మందస, చీపి, బోంధికారి, సింగుపురం, కోరాడబడి, చిన్నకోష్ట, తాళ్లగురంటీ పాఠశాలలను సందర్శించి సంఘ సభ్యత్వం నమోదును చేపట్టారు. సంఘ ప్రతినిధులు గవ్వ భీమారావు, కిరణ్‌కుమార్, కరుణాకర్, చంద్రశేఖర్, డిల్లీరావు, జగదీశ్వరరావు, బైరాగి, రామారావు, ఎస్.కె.హమీద్ ఉన్నారు.

భవన నిర్మాణ పనులు నిలుపుదల చేయాలి

సోంపేట: సోంపేట పట్టణంలోని 178/1 సర్వే నంబర్‌లో నిర్మాణం చేపడుతున్న వాణిజ్య సముదాయ భవన నిర్మాణ పనులు నిలుపుదల చేయాలని హైకోర్టు నుంచి ఉత్తర్వులు వచ్చాయని పలాసపురం సర్పంచ్ తడక జోగారావు మంగళవారం తెలిపారు. భవన నిర్మాణాలు నిబంధనలకు వ్యతిరేకంగా చేపడుతున్నట్లు హైకోర్టులో జోగారావు కేసు వేశారు. దీన్ని పరిగణలోకి తీసుకున్న కోర్టు తదుపరి ఆదేశాలు వచ్చే వరకు మూడు వారాలు నిర్మాణ పనులు నిలుపుదల చేయాలని భవన యజమానులు దుద్ది చిన్నారావు, దుద్ది దాన్నమ్మలకు నోటీసులు అందినట్లు చెప్పారు. నిబంధనలకు వ్యతిరేకంగా పనులు చేపట్టడంతో ప్రజలకు ఇబ్బందులు కలిగే అవకాశం ఉందన్నారు. ఇవే ఉత్తర్వులు జిల్లా, డివిజన్, పంచాయతీ అధికారులకు అందినట్లు పేర్కొన్నారు. కోర్టు ఉత్తర్వులు మేరకు అధికారులు పరిశీలించి నిర్మాణ పనులు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

రక్తదానంపై చైతన్యవంతం కావాలి


రక్తదానం చేస్తున్న విద్యార్థులు

టెక్కలి: స్వచ్ఛంద రక్తదానంపై గ్రామాల్లో మరింత చైతన్యవంతం చేయాలని టెక్కలి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి వైద్యురాలు డాక్టర్ బి.సునీత కోరారు. రెడ్ రిబ్బన్, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..రక్తదానం పై అపోహలు విడనాడే విధంగా అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఎన్ఎస్ఎస్ వలంటీర్లపై ఉందన్నారు. ఈ సందర్భంగా 35 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ, వైస్ ప్రిన్సిపాల్ బి.సతీష్‌కుమార్, ఎన్ఎస్ఎస్ పీవోలు ల్యూక్‌పాల్, వాసుబాబు, గొల్ల పాల్గొన్నారు.

మత్తుకు చిత్తుకావద్దు


కవిటిలో ర్యాలీ చేస్తున్న దృశ్యం

కవిటి: జీవితాలను నిర్వీర్యం చేస్తున్న మత్తు పదార్థాల వినియోగానికి యువత దూరంగా ఉండాలని కవిటి కవిటి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.సింహాచలంనాయుడు అన్నారు. కళాశాలలో, ఇద్దివానిపాలెం ఉన్నత పాఠశాలలో స్థానిక ఈగల్ క్లబ్‌ల ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల రవాణ, వినియోగంపై బుధవారం అవగాహన సదస్సులు, చైతన్యర్యాలీలు చేశారు. కవిటి ప్రభుత్వ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో స్థానిక ఉషోదయ యూత్ మాజీ అధ్యక్షుడు పాండవ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల వినియోగానికి అందరూ దూరంగా ఉండాలన్నారు. ఈగల్ టీం ఇచ్ఛాపురం సర్కిల్ ప్రతినిధి ఎస్.సంతోష్ మాట్లాడుతూ.. విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఇద్దివానిపాలెం ఉన్నతపాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం బి.అప్పలనరసమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విశ్వకర్మ పూజలు


సంతబొమ్మాళిలో విశ్వకర్మకు పూజలు చేస్తున్న భక్తులు


పలాస ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద విశ్వకర్మ పూజలు


సోంపేట: జింకిభద్ర గ్రామంలో విశ్వకర్మకు పూజలు చేస్తున్న భక్తులు


ఇచ్ఛాపురం: రైల్వేఎలక్ట్రికల్ లోకోషెడ్‌లో విశ్వకర్మ పూజలు

వాస్తు శాస్త్రం, శిల్పకళలకు అధిపతైన విశ్వకర్మ భారతీయ సంస్కృతిలో కళలు, చేతివృత్తులు, నిర్మాణాలకు ఆదిగురువుని వక్తలన్నారు. విశ్వకర్మ జయంతి వేడుకలను బుధవారం విశ్వబ్రాహ్మణులు భక్తిశ్రద్ధతో నిర్వహించారు. ఇందులో భాగంగా హోమం కాల్చారు. రాత్రి భజన కాలక్షేపం చేశారు. పూజల్లో అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్


వజ్రపుకొత్తూరు రూరల్: కంచికామాక్షి అలయం వద్ద విశ్వకర్మకు భక్తుల పూజలు

వైద్య శిబిరం



పలాస మండలం టెక్కలిపట్నంలో బుధవారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. 120 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు సరఫరా చేశారు. స్వస్థనారీ, సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వెంకటాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి పి.దేవి, వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ పుట్టిన రోజు సందర్భంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. అక్టోబర్ రెండో తేదీ వరకూ గ్రామాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తామని డాక్టర్ దేవి చెప్పారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, ఆశవర్కర్లు, హెల్త్ అసిస్టెంట్లు, గ్రామ సర్పంచ్ కృష్ణమూర్తి, పంచాయతీ కార్యదర్శి రవి పాల్గొన్నారు.

– పలాస

డిజిటల్ చెల్లింపులపై అవగాహన

డిజిటల్ చెల్లింపులపై అవగాహన పెంచుకోవాలని ఎల్‌డీఎం పి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఆధ్వర్యంలో టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో ఎంబీఏ విద్యార్థులకు డిజిటల్ చెల్లింపులపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రిజర్వ్ బ్యాంక్ విడుదల చేసిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ వి.ఆంజనేయులు, మేనేజర్ వి.అశోక్‌కుమార్, కళాశాల కోశాధికారి టి.నాగరాజు, ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, డీన్ డి.విష్ణుమూర్తి, ఎంబీఏ హెచ్ఓడీ బి.శివకుమార్, ప్రొఫెసర్ కె.వేణుగోపాల్, రిసోర్స్ పర్సన్లు ఎస్.హరిబాబు, ఎ.హరినాథ్, ట్రైనర్లు యు.రాజేష్ పాల్గొన్నారు. – టెక్కలి



ఉత్సవాలకు శుభారాట



ఇచ్ఛాపురం పట్టణంలోని దక్షిణకాళీమాత ఆలయం వద్ద ఈ నెల 22వ తేదీ నుంచి నిర్వహించనున్న కాళీమాతా నవరాత్రి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఈ మేరకు ఆలయం వద్ద వేదపండితులు తెన్నేటి తేజేశ్వర శర్మ ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక పూజలు చేసి శుభరాట వేశారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా కాళీమాతా అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమివ్వనున్నట్లు దక్షిణ కాళీమాత ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. – ఇచ్ఛాపురం